క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందిస్తున్న కార్పొరేటర్ సురేష్, రాంప్రసాద్

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీ మైదానంలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీలను వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ప్రారంభించారు. క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. అనంతరం విజేతలకు కార్పొరేటర్ సురేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు అంగ రామ్‌ప్రసాద్ చేతుల మీదుగా సర్టిఫికెట్‌లు, బహుమతులు అందించారు.కార్యక్రమంలో నిర్వాహకులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు

ఆసక్తికరంగా స్టోరీ టెల్లింగ్



సీతా శ్రీనివాస్ చెబుతున్న కథను ఆసక్తిగా వింటున్న పిల్లలు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం పబ్లిక్ లైబ్రరీ, విద్యా భవన్స్ స్కూల్ సంయుక్తంగా నిర్వహించిన స్టోరీ టెల్లింగ్ పిల్లలను ఉత్సాహపర్చింది. కథాకారిణి ఎం.సీతా శ్రీనివాస్ తనదైన శైలిలో చమత్కారం, తెలివితో ప్రత్యేకత సాధించిన ఒక చిన్న ఉల్లాస భరితమైన 'టైలర్ బర్డ్' కథను ఎంతో ఆసక్తికరంగా వివరించారు. కథ వినడమే కాకుండా వర్క్‌షాప్‌లో పిల్లలు పాటలు పాడి, పక్షులు కట్టె వివిధ రకాల గూళ్ల పరిశీలించి కొత్త విషయాలు నేర్చుకున్నారు. కార్యక్రమంలో పౌర గ్రంథాలయం కార్యదర్శి డి.ఎస్.వర్మ, పెద్ద సంఖ్యలో వివిధ పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా నిత్య కల్యాణం



నిత్య కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరహా లక్ష్మీ నృసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి అంతరాలయ దర్శనం, వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, స్వామివారి ప్రసాదం అందజేశారు.

మేహాద్రిలో ఈత ప్రమాదకరం



మేహాద్రి వద్ద సందర్శకులను హెచ్చరిస్తున్న పోలీసులు

పెందుర్తి: నిండు కుండను తలపిస్తున్న మేహాద్రి గెడ్డ రిజర్వాయర్‌లో ఈత ప్రమాదకమరని సీఐ కేవీ సతీష్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం మేహాద్రికి సందర్శకుల తాకిడి పెరిగిన నేపథ్యంలో సమాచారం అందుకున్న సీఐ సతీష్‌కుమార్ పోలీస్ సిబ్బందిని అక్కడకు పంపి కౌన్సిలింగ్ ఇచ్చారు. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాలను సిబ్బంది సందర్శకులకు వివరించారు. ఇక్కడ ఈత చేయరాదని, వారాంతంలో ఇక్కడకు వచ్చే వారంతా మేహాద్రి పరిసర ప్రాంతాల్లో ప్రకృతి అందాలను చూసి తరించాలి తప్ప ఈతకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేపజేశారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర పూజ చేశారు. దాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇవేం రోడ్లు.. బాబోయ్..



వెంకటాపురం రైల్వే 5 మదుముల వద్ద అధ్వానంగా రోడ్డు

- అడుగడుగునా గుంతలు
- రాకపోకలకు అవస్థలు
- నీరు చేరడంతో గుర్తించలేక ప్రమాదాలు
- రోడ్లు అభివృద్ధి చేయాలని వేడుకోలు



ఈ రోడ్డులో నిత్య ప్రవాహం

గోపాలపట్నం: జీవీఎంసీ 91,92,98 వార్డుల పరిధిలో పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. వర్షాల కారణంగా గొయ్యిలు మరింత ప్రమాదకరంగా మారాయి. పాలకులు పట్టించుకోకపోయినా.. స్థానికులు గుంతలను గృహనిర్మాణ వ్యర్థాలతో పూడ్చారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలు సాగించడానికి ఆయా ప్రాంత వాసులు నిత్యం నరకం చూస్తున్నారు. బాబోయ్ ఇవేం రోడ్లు అని వాపోతున్నారు.

- **జీవీఎంసీ 89వ వార్డులో నరవ వెళ్లే రహదారిలో గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ రహదారి మీదుగా వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో కోరుకు పోతుందని స్థానికులు చెబుతు**న్నారు. నీరునిలిచిపోవడంతో గోతులను గుర్తించలేక వాహన చోదకులు పడిపోతున్నారు.
- 92వ వార్డు వెంకటాపురం రైల్వే 5 మదుముల వద్ద అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొంది.కనీసం నడిచి వెళ్లడానికి వీలుగా బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.
- **91వ వార్డు బాజీ జంక్షన్** నుంచి ఎన్ఏడీ జం**క్షన్ వరకు ఉన్న తాటిపూడి** పైప్‌లైన్ రహదారి **మట్టిరోడ్డుగా మిగిలిపోయిం**ది. ఈ రహదారిని **గేదెలు పెంపకం, వాహనాల** పార్కింగ్‌కు వాడుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. దీన్ని బీఆర్‌టీఎస్ రహదారికి ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేస్తామని హామీలిచ్చి మరిచి పోయారని వాపోతున్నారు. ఈ రహదారిని బీటీ రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.



కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న గోతులు



నరవరోడ్డులో ప్రమాదకరంగా గోతులు

నకిలీ మద్యంతో ప్రజలకు శాపం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మళ్ల విజయప్రసాద్, చింతలపూడి వెంకటరామయ్య తదితరులు

- వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్
- నేడు తహసీల్దార్‌కు వినతి
- కోటి సంతకాల సేకరణ గోడ పత్రిక ఆవిష్కరించిన మళ్ల

గోపాలపట్నం: రాష్ట్రంలో నకిలీ మద్యం పాపం సీఎం చంద్రబాబుదే.. అది ఇపుడు ప్రజలకు శాపంగా మారిందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ ఆరోపించారు. నకిలీ మద్యం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని... ప్రజారోగ్యాన్ని కాపాడాలనే డిమాండ్‌తో సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమంపై నాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్యతో కలిసి మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ నకిలీ మద్యం అమ్మకాలతో ప్రజల ఆరోగ్యం గుల్ల అవుతుందన్నారు. దీనికి నిరసనగా సోమవారం ఆందోళన చేపట్టి అనంతరం గోపాలపట్నం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్టు తెలిపారు. నిరసన ర్యాలీలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొవాలని ఆయన కోరారు. అలాగే ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసి పేదలకు వైద్య భరోసా లేకుండా చేశారని ధ్వజమెత్తారు. ప్రజల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందన్నారు. ప్రజల కోసం ఎంతటి పోరాటైనికైనా సిద్ధమని చెప్పారు. సమావేశంలో రాష్ట్రస్థాయి నాయకులు, వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

కోటి సంతకాల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న పిలక రాము

మల్కాపురం: మెడికల్ కళాశాలలను పీపీపీకి ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో వైఎస్సార్‌సీపీ చేపడుతున్న కోటి సంతకాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 61వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిలక రామ్మోహన్‌రెడ్డి (పిలక రాము) పిలుపు నిచ్చారు. ఈ అంశంపై మల్కాపురం రెడ్డి వీధిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో రాము మాట్లాడారు. కూటమి సర్కారు అధికారంకి వచ్చి 16 నెలల గడుస్తున్నా పేద ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. వీరి పాలనలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టే యత్నాలు, అదాని వంటి సంస్థలకు ప్రభుత్వ భూమిని ధారా దత్తం చేయడం,ఆటో డ్రైవర్లను రోడ్డున పడేయడం, ఆరోగ్య శ్రీని నిర్వీర్యం చేసి పేదలను ఇబ్బందులకు గురి చేయడం మినహా ఒక్క అభివృద్ధి పని చేయలేదని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని... ఉపాధి వచ్చే వరకు నిరుద్యోగ బృతి అని ఇచ్చిన హామీ ఏమైందో కూటమి సర్కార్ చెప్పగలదా అని ప్రశ్నించారు. కూటమి పాలనలో ప్రచారం పీక్‌లో... చేతలు గడప కూడా దాటడడం లేదన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని, యువతకు ఉపాధి లేదని,పైగా లక్షల కోట్ల అప్పు మాత్రం చూపారని ఎద్దేవా చేశారు. పార్టీ నాయకులు గోపి,బూస అప్పలరెడ్డి,సోనూ,మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

తీరప్రాంతంలో వ్యర్థాల తొలగింపు



తీర ప్రాంతంలో సేకరించిన వ్యర్థాలతో యువత

మల్కాపురం: పర్యావరణ పరిరక్షణలో భాగంగా 58వ వార్డు శ్రీహరిపురం ప్రాంతానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త ముప్పిన ధర్మేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం జేబీసీ బాక్సింగ్ క్లబ్‌కు చెందిన చిన్నారులతో కలిసి సాగర్‌దుర్గా సముద్ర తీరంలో పరిశుభ్రం చేశారు. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులు ప్లాస్టిక్ వ్యర్థాలను, తినుబండారాల ప్యాకెట్లు నిర్లక్ష్యంగా డంప్ చేస్తున్నారు. దీంతో తీరం అధ్వానంగా మారుతోంది. సామాజిక స్పృహతో ధర్మేంద్ర పలువురు యువత సాయంతో తీరం పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు.

ఐటీఐలో కొత్త కోర్సులకు దరఖాస్తులు

పెదగంట్యాడ: ప్రభుత్వ ఐటీఐలో కొత్తగా మూడు కోర్సులు ప్రారంభిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఎలక్ట్రానిక్ మెకానిక్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనర్ మెకానిక్, అటెండెంట్ ఆపరేటర్ (కెమికల్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటల్లోపు ఐటీఐ.ఏపీ.జీవో.ఇన్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 4 గంటల నుంచి సర్టిఫికెట్లను పరిశీలన చేస్తామన్నారు. అలాగే పదో తరగతి ఫెయిల్ అయిన, 8వ తరగతి పాసైన వారి కోసం కార్పెంటర్, పెయింటర్, ప్లంబర్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 17న ఉదయం 10 గంటలకు ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.

• విచ్చలవిడిగా మద్యం వ్యాపారం



మనోరమ థియేటర్ ప్రాంతంలో మద్యం బాటిళ్లు తరలిస్తున్న యువకులు

నగరంలో మద్యం వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోంది. బడి.. గుడి.. నడిరోడ్డు.. జనావాసాలు అనే తేడా లేకుండా.. నిబంధనలతో అసలు పనిలేకుండా మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పగలు, రాత్రి.. వేళాపాళా లేకుండా మందుబాబులు మద్యం కొనుగోలు చేస్తూ.. బహిరంగంగా తాగి తూగుతూ నానా రభస చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోంది. మద్యానికి బానిసైన కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



మధురానగర్ రోడ్డులోని స్కూల్‌ను ఆనుకొని నిర్వహిస్తున్న వైన్ షాప్



ఐటీఐ జంక్షన్ వద్ద వైన్ షాపు మేడపై మద్యం తాగుతున్న మందుబాబులు

నూతన కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న కళింగ వైశ్య సంఘం నూతన కమిటీ

గోపాలపట్నం: మాతా కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గోపాలపట్నం, కొత్తపాలెం ప్రాంత కళింగ వైశ్యుల సర్వ సభ్య సమావేశం ఆదివారం నాగేంద్ర కాలనీలో నిర్వహించారు. సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా శొంఠి జగదీష్, సింహాద్రి శంకరరావు, కోశాధికారిగా గుడ్ల మిన్నారావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు పంచతత్వ పార్క్‌లో వాచ్‌మెన్ గది, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు కార్పొరేటర్ రమణ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ నిధులు రూ. 8.52 లక్షలు వెచ్చిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ వెంకటలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

బంగారు గొలుసు అందజేత



బాధితురాలు సత్యవతికి గొలుసు అందిస్తున్న కానిస్టేబుల్ తేజేశ్వరరావు

గోపాలపట్నం: సింహాచలం దేవస్థానంలో మహిళ పోగొట్టుకున్న బంగారు గొలుసును గోపాలపట్నం నేర విభాగం పోలీసులు గంటల వ్యవధిలో బాధితురాలికి అందించారు. క్రైం పోలీసులు తెలిపిన వివరాలు.. విజయనగరం జిల్లా బొబ్బిలి ప్రాంతానికి చెందిన సత్యవతి సింహాచలం శ్రీ వరాహ నృసింహ స్వామిని దర్శించుకుని ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆలయం నుంచి బయటకు వచ్చింది. ఆ సమయంలో చూసుకునే సరికి మెడలో గొలుసు కనిపించక పోవడంతో ఆందోళన చెంది పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ మీసాల చంద్రమౌళి పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కానిస్టేబుల్ తేజేశ్వరరావు సీసీ ఫుటేజీలను పరిశీలించి పోగొట్టుకున్న గొలుసును గుర్తించి బాధితురాలు సత్యవతికి అందించారు. పోలీసులు చూపిన చొరవకు ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్ర వాహన చోరుల అరెస్ట్

గోపాలపట్నం: చోరీకి గురైన పలు ద్విచక్రవాహనాలను గోపాలపట్నం క్రైం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 6న సింహాచలానికి చెందిన మంత్రి సాయి సుధీర్, కొలుసు నూకరత్నం ఇచ్చిన ఫిర్యాదుల మేరకు దర్యాప్తు చేపట్టారు. ఆరిలోవ ప్రాంతంలో ద్విచక్రవాహనం ఉందన్న సమాచారం మేరకు కాపుకాసి వాహనంపై వస్తున్న ఇద్దరిని పట్టుకున్నారు. వారి నుంచి సేకరించిన సమాచారం మేరకు మరో రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మత్తుకు బానిసై బైకులు దొంగతనం చేసి వాటిని అమ్మి మద్యం, గంజాయి సేవించడం వీరి పని వెల్లడించారు. ఆరిలోవకు చెందిన గుజ్జు నిషాంత్ రెడ్డి, మరొకరు మైనర్ బాలుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రెండు సింహాచలం ప్రాంతం వారివి కాగా మరొకటి భీమిలికి ప్రాంతానికి చెందినది. ఈ కేసు ఛేదనలో ప్రతిభకనబరిచిన ఏఎస్ఐ గోవిందమ్మ, కానిస్టేబుళ్ల నరేష్, శివకృష్ణ, సుధాకర్, బాలాజీలను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

మంచి సమాజం కోసం కృషి చేద్దాం



ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

గోపాలపట్నం: రాష్ట్రీయ స్వయం సేవక్ శతాబ్ది ఉత్సవాలను ఆదివారం కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. మహానగర కార్యవహ కృష్ణమాచార్యులు తదితరులు ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ మంచి సమాజం కోసం కృషి చేద్దామన్నారు. సంఘ సిద్ధాంతాలను గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నాడ వెంకటరమణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'అంకెల మామయ్య'..భలే శిక్షణ ఇచ్చాడు..



వర్క్‌షాప్‌లో పాల్గొన్న చిన్నారులకు శిక్షణ ఇస్తున్న చంద్రయ్య

మద్దిలపాలెం: పిల్లలను మొబైల్ ఫోన్ల వ్యసనం నుంచి దూరం చేసి, వారిలో సృజనాత్మకతను, ఏకాగ్రతను పెంచే లక్ష్యంతో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శివాజీ పాలెంలో ఆదివారం ఒక ప్రత్యేకమైన వర్క్‌షాప్ నిర్వహించారు. 'మొబైల్ డి–అడిక్షన్, ఫన్ మ్యాథ్స్, చిట్టి ప్రయోగాలు' అనే ఈ కార్యక్రమంలో ప్రముఖ మెజీషియన్, 'అంకెల మామయ్య' చంద్రయ్య శిక్షణ ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా చంద్రయ్య సైన్స్ సూత్రాలను చిన్న చిన్న ప్రయోగాల ద్వారా చిన్నారులకు అర్థమయ్యే విధంగా వివరించారు. హిప్నోటిక్ స్ట్రా, ఎగిరే స్ట్రా, తిరుగుతున్న స్ట్రా, మ్యాచ్ బాక్స్ రైలు, విధేయుడైన అగ్గిపెట్టె, సింపుల్ యానిమేషన్, పేపర్ విజిల్, అరచేతిలో మ్యాజిక్ వంటి ఆసక్తికరమైన అంశాలతో పిల్లలు ప్రయోగాలు చేసి నేర్చుకున్నారు. మరోవైపు గణితంలో సరదా అంశాలైన తప్పిపోయిన అంకె, పుట్టినరోజు తర్కం, వయస్సు రహస్యం, స్పెల్లింగ్ లాజిక్ వంటివాటిని చెప్పించారు. ఈ కార్యకలాపాల ద్వారా పిల్లలు కేవలం సమయాన్ని గడపడమే కాకుండా, వాటి వెనుక ఉన్న సైన్స్ సూత్రాలు సులువుగా తెలుసుకుంటారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ తరహా వర్క్‌షాప్‌ల ద్వారా పిల్లల్లో శ్రద్ధ, మెరుగైన జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, విమర్శనాత్మక ఆలోచన పెరుగుతాయని చంద్రయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో కాయిన్ మ్యాజిక్ కాజా కూడా పాల్గొనగా, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు ఆవుల మృతి



ఘటనా స్థలిలో మరణించిన ఆవులు

మల్కాపురం: సర్వీస్ రోడ్డులో తెగిపడ్డ విద్యుత్ వైర్ కారణంగా రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. వివరాలు.. 58వ వార్డు ములగాడ నుంచి శ్రావణ్ షిప్పింగ్ మీదుగా మారుతీ సర్కిల్‌కు వెళ్లే మార్గంలో కొన్ని రోజులుగా రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నాయి. దీంతో మారుతీ సర్కిల్‌కు వచ్చే వాహనాలను దారి మళ్లించారు. దారి మళ్లించిన మార్గంలో నేలపై విద్యుత్ వైర్ పడి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు నేల నాని ఉంది. శనివారం అర్ధరాత్రి విద్యుత్ వైర్ పడి ఉన్న మార్గాన సంచరిస్తున్న ఆవులు, ఆ వైర్‌కు సమీపం నుంచి వెళ్తూ షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాయి. ఉదయం ఆ మార్గాన వచ్చే వాహనదారులు పడి ఉన్న ఆవులను చూసి, పరిశీలించగా, అక్కడ తెగిపడ్డ విద్యుత్ వైర్‌ను గుర్తించారు. కరెంట్ షాక్‌తో ఆవులు మృతి చెందాయని గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు అప్రమత్తమయ్యారు. ఆ సమయంలో మనుషులు సంచరిస్తే వారి పరిస్థితి ఏంటని స్థానికులు ఆందోళనకు గురయ్యారు.